క్లుప్తంగా

ఏయూలో డిప్యుటేషన్లు రద్దు చేయాలని నిరసన



ఏయూ గేటు ముందు నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న అధ్యాపకులను వారి మాతృ సంస్థలకు పంపించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రాష్ట్ర కన్వీనర్ ఎ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ అర్హత లేని, డిగ్రీ కళాశాల అధ్యాపకులతో విద్యను బోధించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి, వెంటనే డిప్యుటేషన్లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ నాయకులు నరసింహ, కోటేశ్వరరావు, రఘుతేజ, శ్రీను, వెంకటేష్, శివకుమార్, అయ్యప్ప, విజయ్, పవన్, వంశీ పాల్గొన్నారు.

నేడు, రేపు కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: నగరంలోని రామ్‌నగర్ కేంద్రంగా గల వైద్యరాజ్ ఔషధాలయంలో ఈ నెల 19, 20 తేదీల్లో కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు ఔషధాలయ మేనేజర్ దినూప్ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఆ రెండు రోజులు ఔషధాలయంలో అందుబాటులో ఉండి, దీర్ఘకాల రోగాలకు పంచకర్మ విధానం ద్వారా కేరళ ఆయుర్వేద వైద్యం అందించనున్నట్టు పేర్కొన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సోరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్ (ఆందోళన), కీళ్ల వ్యాధులు, నడుంనొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి డాక్టర్ నాయర్ సేవలందిస్తారని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం 91331 06060 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలియజేశారు.

విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం స్కూల్, శాంతినికేతన్ స్కూల్, జేకే స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. వారి అభిరుచికి అనుగుణంగా వివిధ రకాల చిత్రాలు గీశారు. పోటీలను కేడీపీఎం స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ ప్రసాద్, తెలుగు ఉపాధ్యాయిని సత్యవతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంవీపీ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 19న మంగళవారం ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఓబీసీ క్రిమిలేయర్‌లో వేతనం లెక్కించొద్దు'

మద్దిలపాలెం: ఓబీసీ నాన్ క్రిమిలేయర్ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సివిల్ ఎగ్జామ్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఓబీసీ క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయడంలో వారి తల్లిదండ్రుల వేతనాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఓబీసీ వర్గం తల్లిదండ్రుల పిల్లల విషయంలో వీరి ఆదాయాన్ని బట్టి క్రిమిలేయర్ సహజంగా నిర్ణయిస్తారన్నారు. ఒకవేళ ఆదాయం రూ.8 లక్షలు మించితే వారి పిల్లలకు రిజర్వేషన్లు వర్తించవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆలోచించి ఓబీసీలకు మేలు జరిగేలా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డేంజర్ బెల్స్



- ప్రాణాలు బలిగొంటున్న అనధికారిక స్పీడ్ బ్రేకర్లు
- ఆరిలోవ ప్రాంతం ప్రధాన రహదారులపై అనుమతులు లేకుండా నిర్మాణం
- దారపాలెం వద్ద ఇటీవల ప్రమాదానికి గురై విమ్స్ ఉద్యోగి మృతి
- మరికొన్ని ప్రమాదాల్లో 20 మందికి పైగా గాయాలు



సూర్యతేజనగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా అనధికారికంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు



దారపాలెం వద్ద యువకుడి ప్రాణాలు బలిగొన్న స్పీడ్ బ్రేకర్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని ప్రధాన రహదారులు, బీఆర్‌టీఎస్ రోడ్లపై అనధికారికంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు నిలయమయ్యాయి. కొన్ని చోట్ల ప్రాణాలు కూడా బలిగొంటున్నాయి. వాహనాల వేగ నియంత్రణ, ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లే అపాయకరంగా మారాయి. వేగ నిరోధకాలను ఎక్కడ ఏర్పాటు చేయాలో ట్రాఫిక్ పోలీసులు ఆలోచించి నిర్ణయిస్తారు. జీవీఎంసీ అధికారుల ద్వారా వాటిని అవసరమైన చోట్ల మాత్రమే నిర్మింపజేస్తారు. అలా కాకుండా ఎమ్మెల్యే వేసుకోమన్నారంటూ.. కొందరు స్థానికులు అధికారుల అనుమతి లేకుండా నచ్చిన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుపోతున్నారు. ఇలా అనధికారికంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వేసిన స్పీడ్ బ్రేకర్ వల్ల వారం రోజుల కిందట ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.

ఎమ్మెల్యే సై అనడంతో..

జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలో మూడు వారాల కిందట ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్థానికులతో సమావేశం నిర్వహించారు. అక్కడ ఇటీవల భవంతులు నిర్మించుకున్న కొందరు వారి ఇళ్లకు సమీపంలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసుకుంటామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన సై అనడంతో జీవీఎంసీ అధికారులను, ట్రాఫిక్ పోలీసులను సంప్రదించకుండా బీఆర్‌టీఎస్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసేశారు. దానిపై ఎలాంటి రేడియం రంగులు వేయలేదు. అక్కడ వీధిలైట్లు కూడా వెలగడం లేదు. రాత్రి వేళ చీకట్లో స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలు నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదాల బారిన వాహన చోదకులు

జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజనగర్‌లో కూడా స్థానికులు అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీని వద్ద కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరం నుంచి పార్వతీనగర్ బ్రిడ్జి వరకు గత ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మించింది. దీని మధ్యలో సూర్యతేజనగర్ వద్ద స్థానికులు రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దానిపై కూడా రేడియం రంగు వేయలేదు. ఇక్కడ వేగ నిరోధకాలు ఉన్నట్లు గమనించని వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎమ్మెల్యే వేసుకోమన్నారంటూ కొందరు స్థానికులు అవగాహన రాహిత్యంతో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే కూడా ఇలాంటి వాటికి అనుమతులు ఇచ్చే ముందే అధికారులతో చర్చిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

ప్రాణాలు కోల్పోయిన యువకుడు

హనుమంతవాక నుంచి సింహాచలం వైపు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వెళ్లే వారిలో సుమారు 20 మందికి పైగా దారపాలెం స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. వారిలో ఈ నెల 9న విమ్స్‌లో విధులు ముగించుకొని రాత్రి వేళ ద్విచక్ర వాహనంపై నరవలోని తన ఇంటికి వెళ్తున్న పేడాడ మోహన్‌కుమార్(26) దారపాలెం స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వేయమన్నారని అవగాహన లేకుండా, అధికారులను సైతం సంప్రదించకుండా అనధికారికంగా ఇక్కడ నిర్మించిన స్పీడ్ బ్రేకర్ ఆ యువకుడి ప్రాణాలు బలితీసుకొంది. ఈ ఘటనతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసిన వారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసి అక్కడ స్పీడ్ బ్రేకర్‌ను తొలగింపజేశారు. ఎమ్మెల్యే చెప్పడంతో కొందరు నివాసులు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ నిండు ప్రాణం బలితీసుకొందని దారపాలెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదల ఇంటి స్థలం హామీ నెరవేర్చాలి



ఆరిలోవలో సచివాలయం-5 సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: ఇళ్లు లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆరిలోవ భగత్‌సింగ్ నగర్ నుంచి లక్ష్మీనగర్‌లోని 5వ నంబర్ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చాలని నాయకులంతా నినాదాలు చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు విమల మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతంలో కొన్నేళ్ల నుంచి సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బంది పడుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. వీరంతా పెరుగుతున్న అద్దెలు తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇంటి స్థలం ఇస్తామని కూటమి నేతలు హామీ ఇవ్వడంతో ప్రజలు ఎంతో ఆశతో ఓట్లు వేసి గెలిపించారన్నారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైనవారికి ఇంటి స్థలంతోపాటు నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దేవుడమ్మ, లక్ష్మణరావు, చిరంజీవి, రవి, పుష్పలత, రాజు పాల్గొన్నారు.

ఏయూలో అనవసర రాజకీయాలు వద్దు

ఏయూ పరిరక్షణ సమితి విజ్ఞప్తి

విశాఖ విద్య: అనవసర రాజకీయాలు, స్వార్థపరమైన ఆలోచనలతో కొంతమంది ఆంధ్రా యూనివర్సిటీ ప్రశాంతతను భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచిది కాదని ఏయూ పరిరక్షణ సమితి కోరింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు మల్లు మహేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల పేరుతో అకారణంగా ధర్నాలు, రాస్తారోకోలు చేయడం పరిపాటైందన్నారు. ఇలాంటి చర్యలతో ప్రశాంతమైన ఏయూ వాతావరణాన్ని భగ్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై వచ్చిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులను విశ్వవిద్యాలయం నుంచి సాగనంపాలనే డిమాండ్ న్యాయపరమైనదని, దీని కి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం వద్ద పరిష్కారం కోసం పెండింగ్‌లో ఉందని, నిర్ణయం తీసుకోవలసింది కూడా రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. ఈ డిమాండ్ కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆఫీస్ ముందు ధర్నా చేస్తే బాగుంటుందని, తాము కూడా భాగస్వాములవుతామని చెప్పారు. ఏయూకు సంబంధం లేని విషయాలపై రాద్ధాంతం చేయడం తగదని సూచించారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని కొంతయినా అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె సోమవారం తమ క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణ కోసం జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగిస్తోందన్నారు.

విద్యార్థి వీసాలపై అవగాహన



వర్సిటీ అమెరికన్ కార్నర్‌లో డాక్యుమెంటరీని తిలకిస్తున్న ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అవసరమైన విద్యార్థి వీసాల దరఖాస్తు, మంజూరు విధానంపై అమెరికా ఎంబసీ(హైదరాబాద్) కౌన్సిలర్ ఇన్ఫర్మేషన్ యూనిట్, డిప్యూటీ చీఫ్ జీన్ సోకోలోవ్స్కీ అవగాహన కల్పించారు. సోమవారం అమెరికన్ కార్నర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొని విద్యార్థి వీసాల విధానాన్ని తెలియజేశారు. అమెరికాలో 4,500 పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు ఎఫ్-1 వీసా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ సహకారం అందిస్తుందని చెప్పారు. వీసాకు దరఖాస్తు చేసే ప్రక్రియను 18 నెలలు ముందుగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థి ఎంపిక చేసుకున్న ఉన్నత విద్యా సంస్థ నుంచి ఐ 20 పొందిన తరువాత వీసా ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. వీసా దరఖాస్తు చేయడంలో ఐదు దశలను వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు ఆమె సమాధానమిచ్చారు. కార్యక్రమంలో అమెరికా ఎంబసీ పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మేకైన్, ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ పాల్గొన్నారు.

యూఎస్ బిజినెస్ టూరిజం వీసాపై సదస్సు



ఎంపీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యూఎస్ బిజినెస్ టూరిజం వీసాపై సదస్సు నిర్వహించారు. యూఎస్ కన్సలేట్ జనరల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. వ్యాపారం, పర్యటన వీసాల సంబంధిత ప్రక్రియలపై సదస్సు నిర్వహించారు. ఏయూ మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో యువత కీలకం

మద్దిలపాలెం: పర్యావరణ హితంగా జీవించడానికి మార్గాన్ని మనమే సుగమం చేసుకోవాలని, దీనిలో యువత కీలకపాత్ర పోషించాలని భారత ప్రజారోగ్య సంస్థ కేంద్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సోమవారం వ్యూస్ సంస్థ కో ఆర్డినేటర్ నేతృత్వంలో, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థతో కలిసి నిర్వహించిన క్లైమేట్ ఫర్ యూత్ యాక్షన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటి పెంచాలని, అడవులు, కొండలు, గుట్టల పరిరక్షణకు కృషి చేయాలని యువతకు సూచించారు. నదులు, వాగులు, సముద్రాల్లోకి హానికరమైన రసాయనాలు, భారలోహాలు, హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలు వెళ్లకుండా చూడాలని, ప్రజలను చైతన్య పరచాలని కోరారు. గాంబియా సోషల్ వర్క్ విద్యార్థిని ఆడమ్ బి సార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. విశాఖలో పలు సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. తాను ఇటువంటి కార్యక్రమాల్లో స్వయంగా పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ సోషల్ వర్క్ విద్యార్థినులు బి.చైతన్య సరస్వతి, బి.తేజస్విని, ఎకో వారియర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

మహారాణిపేట: కార్గిల్ విజయ్ దివస్, వీర్ నారీలకు మద్దతుగా సోమవారం నగరంలో బైక్ ర్యాలీ జరిగింది. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. బీచ్ రోడ్డు మీదుగా ఎంవీపీ కాలనీలో ఉన్న సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. నేవీకి చెందిన చెంగలరావు, కృష్ణారావు, సీనియర్ వెటరన్ జగన్‌మోహనరావు, టీమ్ ఇన్‌చార్జి రమేష్, కో ఆర్డినేటర్ పి.వి.రావు, నార్త్ ఆంధ్రా వెటరన్ అసోసియేషన్ సభ్యులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, రాష్ట్ర క్వాలిటీ కన్సల్టెంట్ సురేష్ పల్లా, రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారుల ఎంఎల్‌హెచ్‌పీ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని ఆస్పత్రుల్లో ఎన్‌క్యూఏఎస్ సూచించిన ప్రమాణాలు పాటించాలన్నారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరమశివా పాహిమాం



పెదగదిలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పీతలవానిపాలెం శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



కొత్తవెంకోజీపాలెం ఆలయంలో నందీశ్వరుడి వద్ద పూజలు

ఆరిలోవ: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. వేకువజాము మొదలు పరమశివుడిని దర్శించుకుని భక్తితో పూజించారు. ఆరిలోవ ఆపరేషన్ కాలనీ, శివాజీనగర్-2, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, నెహ్రూనగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్ ప్రాంతాల్లోని ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మద్దిలపాలెం: కొత్తవెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, మహా రుద్రాభిషేకం చేశారు. ప్రధాన అర్చకుడు అరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణశర్మ, పి.సుబ్రహ్మణేశ్వరశాస్త్రి, పి.బాలభాస్కరశర్మ తదితరులు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయం వెనుక ప్రతిష్ఠించిన చిన్న నంది విగ్రహం వద్ద మహిలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ జ్యోతిని వెలిగించారు. పూజా కార్యక్రమాలకు దేవస్థానం, గ్రామ సేవా సంఘం సభ్యులు సహకరించారు.

- ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆకాశదీపాలు వెలిగించారు.
- పీతలవానిపాలెం, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, కేఆర్‌ఎం కాలనీ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



డాక్టర్ సంగీత కౌల్‌కు మెమెంటో అందిస్తున్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: మారుతున్న సాంకేతికత అభివృద్ధి నేపథ్యంలో సమాచారం విస్తృతంగా లభ్యమవుతోందని, దీనిని సద్వినియోగం చేసుకునేలా యువత అవగాహనతో నడుచుకోవాలని డెల్ నెట్ డైరెక్టర్ డాక్టర్ సంగీత కౌల్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏయూలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గ్రంథాలయాలను అనుసంధానం చేస్తూ డెల్ నెట్ పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూ వెబ్‌సైట్‌లో డెల్ నెట్ లింక్ ఉపయోగించుకుని జర్నల్స్, పుస్తకాలు పొందే విధానాన్ని తెలియజేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను సైతం దేశ వ్యాప్తంగా వేరొక లైబ్రరీ నుంచి కొరియర్ ద్వారా పంపే అవకాశం తాము కల్పిస్తున్నామని చెప్పారు. డెల్ నెట్ ఉపయోగించి పుస్తకాలను, జర్నల్స్ పొందే విధానాన్ని ప్రత్యక్షంగా విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయానికి యువతను చేరువ చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థుల సందేహాలకు డాక్టర్ సంగీత సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో సంగీత కౌల్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆమెను పుష్పగుచ్ఛంతో వారు సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంపై డాక్టర్ సంగీత సంతోషం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి పాదుకోత్సవం



సత్యసాయిబాబా పాదుకలను పూజలకు తీసుకొస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: స్థానిక శ్రీసత్యసాయి ప్రేమసదన్‌లో సోమవారం సామూహిక సత్యసాయి పాదుకోత్సవం వైభవంగా జరిగింది. సత్యసాయి బాబా 99వ జయంతిని పురస్కరించుకుని సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు వారి ఇంటిలోని పూజా మందిరాల నుంచి స్వామివారి పాదుకలను శాస్త్రోక్తంగా పూజకు తీసుకొచ్చారు. ప్రేమసదన్‌లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు పూజా సామగ్రిని నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయకుడు, సిటీ సేవా సమితి ప్రతినిధులు, భజన మండళ్లు, పదాధికారులు పాల్గొన్నారు.

'అపార్' కష్టాలపై ప్రత్యేక దృష్టి సారించండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

విశాఖ విద్య: అపార్ కార్డుల జారీ ప్రక్రియలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సాంకేతిక ఇబ్బందులను సత్వరమే పరిష్కరించేలా శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు లేఖ రాసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అపార్ పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.